# సాక్షి అనకాపల్లి

గురువారం । 8 । ఆగస్టు । 2024




## న్యూస్‌రీల్

### పంద్రాగస్టు పరేడ్‌కు చిననందిపల్లి విద్యార్థిని


దివ్య నయన

దేవరాపల్లి: చిననందిపల్లి గ్రామానికి చెందిన సబ్బవరపు దివ్య నయన విజయవాడలో ఈనెల 15న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే స్వాతంత్య్ర దినోత్సవ పరేడ్‌కు ఎంపికయింది. ఈ విషయాన్ని విద్యార్థిని తండ్రి సబ్బవరపు రమణ బుధవారం స్థానిక విలేకర్లకు తెలిపారు. విశాఖలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న దివ్య నయన ఎన్‌సీసీ విద్యార్థిని. విశేష ప్రతిభ కనబరిచి పంద్రాగస్టు వేడుకలకు ఎంపికైంది.

### ఎస్‌ఎంసీ ఎన్నికలు వాయిదా

అనకాపల్లి: జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఈనెల 8వ తేదీన జరగవలసిన పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలను ప్రభుత్వ ఆదేశాల మేరకు వాయిదా వేసినట్టు డీఈవో ఎం.వెంకట లక్ష్మమ్మ బుధవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు.

### 108లో సుఖ ప్రసవం


పసికందుతో 108 సిబ్బంది

నాతవరం: గర్భిణిని 108 వాహనంలో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో ప్రసవించింది. వల్సంపేట పంచాయతీ శివారు ఉటమల్ల గ్రామానికి చెందిన జి.సౌమ్య అనే గర్భిణికి బుధవారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో ఆశ కార్యకర్త లక్ష్మి 108కు సమాచారం ఇచ్చి వాహనంలో ఆస్పత్రికి తరలించారు. మార్గంమధ్యలో 108 వాహనంలోనే సౌమ్య బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను నాతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈఎంటీ ప్రసాద్, ఆశ కార్యకర్త సంయుక్తంగా వైద్య సేవలు అందించి ప్రసవం సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు.

- ధరలతో బెంబేలెత్తుతున్న వినియోగదారులు
- నెల రోజుల నుంచి విక్రయిస్తున్నా తరగని నిల్వలు
- రోజుకు 100 టన్నుల అమ్మకాలూ గగనమే!
- ఇదీ నక్కపల్లి, నర్సీపట్నం స్టాక్ పాయింట్ల పరిస్థితి


నక్కపల్లిడిపోలో ఉన్న ఇసుక నిల్వలు

# ఈ ఇసుక మాకొద్దు బాబోయ్

**ఉచితం పేరిట తమ కంట్లో 'ఇసుక'చల్లిన కూటమి ప్రభుత్వ తీరుపై జిల్లా జనం గుర్రుగా ఉన్నారు. గత ప్రభుత్వంలో కంటే ఇసుక ధర ఎక్కువగా ఉండటంపై ఆగ్రహిస్తున్నారు. మరీ అవసరమనుకుంటే పక్క జిల్లాకు పరుగు తీస్తున్నారు తప్ప, జిల్లాలోని ఇసుక డిపోల్లో కొనుగోలుకు ఆసక్తి చూపట్లేదు. నక్కపల్లి, గబ్బాడ ఇసుక డిపోల్లో నెల రోజులుగా జరిగిన ఇసుక విక్రయాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. గతంలో రోజూ వేల టన్నుల్లో జరిగిన విక్రయాలు ప్రస్తుతం వంద టన్నులు కూడా దాటట్లేదు. నక్కపల్లి స్టాక్ పాయింట్ వద్ద ఈనెల 4 నాటికి కేవలం 2,750 టన్నులు మాత్రమే విక్రయించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.**

నక్కపల్లి: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో తొలి వైఫల్యం ఉచిత ఇసుకే. లోడింగ్ చార్జీల పేరిట ఇసుక ధరను గత ప్రభుత్వం కంటే ఎక్కువ చేశారు. దీనికి తోడు అడ్డగోలు నిబంధనలు, కూటమి నేతల అజమాయిషీ షరా మామూలే. దీంతో ఇసుక కొనుగోళ్లకు జనాలు ముందుకు రావట్లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, మైనింగ్ సిబ్బంది డిపోల్లో పడిగాపులు కాస్తున్నా.. ఫలితం దక్కట్లేదు. రోజుకు కనీసం 10 ట్రాక్టర్ల(50 టన్నుల) ఇసుక కూడా అమ్ముడుపోవట్లేదు.

**ఉచితం పోయి.. అదనపు భారం**

జిల్లాలో పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి, నర్సీపట్నం నియోజకవర్గంలోని గబ్బాడలో ఇసుక డిపోలు ఉన్నాయి. ఇసుక దోపిడీకి అడ్డుకట్ట వేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా తవ్వకాలు జరిపి సాధ్యమైనంత తక్కువ ధరకు వినియోగదారులకు అందించేది. సార్వత్రిక ఎన్నికల ముందు ఈ డిపోలో సుమారు 80 వేల టన్నుల ఇసుకను నిల్వ ఉంచింది. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇసుక విక్రయాలు నిలిచిపోయాయి. తాము అధికారంలోకి వస్తే ఇసుక ఉచితంగా సరఫరా చేస్తామని కూటమి పార్టీలు హామీ ఇచ్చాయి. తీరా అధికారంలోకి వచ్చాక టన్ను ఇసుక ధర రూ.1225లుగా నిర్ణయించారు. ఉచితం పోయి ధర పెంపు, పైపెచ్చు కూటమి నేతల అజమాయిషీతో రవాణా చార్జీలూ పెరగడంపై వినియోగదారులు మండిపడుతున్నారు.

**పెద్దాపురం నుంచి కొనుగోళ్లకు ఆసక్తి**

పక్కనే ఉన్న తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం ఇసుక ర్యాంపు వద్ద టన్ను ఇసుక ధర రూ.650. దీంతో ఒకేసారి 30 టన్నులు చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఇలా చేస్తే వినియోగదారుడు 30 టన్నుల ఇసుకకు రూ.19,500లు చెల్లిస్తే చాలు. దీనికి రవాణా చార్జీలు రూ.12 వేలు నుంచి రూ.14 వేలు. దీంతో రూ.32–34 వేలతో 30 టన్నుల ఇసుక ఇంటికొచ్చేస్తోంది. అదే పరిమాణంలో నక్కపల్లి స్టాక్ పాయింట్ నుంచి కొనుగోలు చేస్తే అదనంగా కనీసం రూ.10 వేలు చెల్లించాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. దీంతో తమ దగ్గర్లో ఉన్న డిపోలకంటే పక్క జిల్లా నుంచి తెచ్చుకునేందుకే వారు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.


నక్కపల్లిలో ఇసుక విక్రయాలు

### మేం నిందలు పడుతున్నాం

ప్రభుత్వ స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక కొనుగోలుచేస్తే గతం కంటే ధర కాస్త ఎక్కువగానే ఉంది. ఐదు టన్నుల ట్రాక్టర్ లోడ్ కావాలంటే కేవలం ఇసుక ధరే రూ.6,150 అవుతోంది. డిపో నుంచి కనీసం 10 కి.మీ. దూరం లోడ్ తీసుకెళ్లాలంటే రవాణా చార్జీలు రూ.2 వేలుంటేగానీ గిట్టుబాటు కాదు. ఈ లెక్కన ట్రాక్టర్ ఇసుక రూ.8 వేలు దాటుతోంది. ప్రజలకు ఇది చాలా ఎక్కువగా కనిపిస్తోంది. ప్రభుత్వం ఉచితంగా ఇస్తే మేమే డబ్బులు తీసుకుంటున్నామని కొందరు మమ్మల్ని నిందిస్తున్నారు. దీంతో కొనుగోలుకు ముందుకు రావట్లేదు. అధిక మొత్తంలో ఇసుక కావాల్సిన వారు మాత్రం పెద్దాపురం నుంచి తెచ్చుకుంటున్నారు. దీంతో మాకూ బేరాల్లేకుండా పోతున్నాయి.

– వియ్యపు వరహాలు, ట్రాక్టర్ యజమాని

### నెల రోజుల్లో విక్రయాలింతే..!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి నక్కపల్లి డిపోలో 28,915 టన్నులు, నర్సీపట్నంలోని గబ్బాడ డిపోలో 48,204 టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. గత నెల 8 నుంచి ప్రభుత్వం అధికారికంగా ఇసుక విక్రయాలు ప్రారంభించింది. ఆగస్టు 4 నాటికి అందుబాటులో ఉన్న అధికారిక లెక్కల మేరకు నక్కపల్లి స్టాక్ పాయింట్ వద్ద కేవలం 2,750 టన్నులు మాత్రమే విక్రయించారు. నర్సీపట్నం స్టాక్ పాయింట్‌లో అయితే గత నెల 30 వరకు ఒక్క టన్ను ఇసుక కూడా విక్రయించలేదు. ఈ రెండు డిపోల్లో టన్ను ధర రూ.1225. రవాణా చార్జీలు కలిపి 10 కి.మీ. దూరానికి ట్రాక్టర్ ఇసుక(దాదాపు 5 టన్నులు) తీసుకెళ్తే సుమారు రవాణా చార్జీలు రూ.2 వేలుతో కలిపి రూ.8,300లు చెల్లించాల్సి వస్తోంది.

# విజయం మనదే..


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ

- ఎమ్మెల్సీ ఎన్నికలో భారీ మెజారిటీతో గెలుస్తాం
- సగం ఓట్లు కూడా లేని కూటమి కుట్ర చేయాలని చూస్తోంది
- కుయుక్తుల చంద్రబాబుకు త్వరలోనే గుణపాఠం
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ

అనకాపల్లి: తగిన సంఖ్యాబలం లేకుండా కుట్రలు, కుతంత్రాలతో రాజకీయం చేద్దామని చూస్తున్న చంద్రబాబుకు స్థానిక ప్రజాప్రతినిధులు గుణపాఠం చెప్పనున్నారని మాజీ మంత్రి, ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ అన్నారు. రింగ్‌రోడ్డులోని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అధ్యక్షతన నియోజకవర్గ ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కార్పొరేటర్లతో బుధవారం జరిగిన సమావేశంలో బొత్స మాట్లాడారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎమ్మెల్సీ ఓటర్లు 858 మంది కాగా.. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు 630 మంది ఉన్నారని, టీడీపీ వర్గీయులు కేవలం 228మందేనని చెప్పారు. అధికార గర్వంతో చంద్రబాబు పోటీకి దిగాలని చూస్తున్నారని, వైఎస్సార్‌సీపీ బలం ముందు ఆయనకు గర్వభంగం కావడం ఖాయమన్నారు. 114 మంది ఎంపీటీసీలు పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డిని కలుసుకునేందుకు వెళుతుంటే, పార్టీలు మారిపోతున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు.

**పాలనపై దృష్టి పెట్టండి**

మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఈనెల 30న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను గెలిపించి వైఎస్సార్‌సీపీ విజయ ఢంకా మోగించాలని పిలుపునిచ్చారు. మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు పాలనపై దృష్టి సారించకుండా ఎన్నికలపై దృష్టి పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ 2 సంవత్సరాలు కరోనాతో ప్రపంచం అతలాకుతలం అవుతున్నప్పటికీ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఇబ్బందులు పడకూడదని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలను అమలు చేసినట్లు చెప్పారు. ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ పెద్దల సభకు ఉత్తరాంధ్ర సీనియర్ నేత బొత్సను అభ్యర్థిగా బరిలోకి దించడం శుభపరిణామమన్నారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ సుదీర్ఘ అనుభవం కలిగిన వ్యక్తిని ఎమ్మెల్సీగా గెలిపించుకునే బాధ్యత మన నియోజకవర్గంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కార్పొరేటర్లపై ఉందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బి.వెంకట సత్యవతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, అనకాపల్లి, కశింకోట ఎంపీపీలు గొర్లి సూరిబాబు, కలగ లక్ష్మీగున్నయ్యనాయుడు, కశింకోట జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు పాల్గొన్నారు.



### నేతన్నలకు డిజైనర్లతో ప్రత్యేక శిక్షణ

- ముడి సరుకు సరఫరా చేసేందుకు చర్యలు
- చేనేత దినోత్సవంలో కలెక్టర్ విజయ కృష్ణన్

8లో




# కుట్ర పన్ని.. కాసులు కుమ్మరించి..!

- జీవీఎంసీ స్టాండింగ్ కమిటీని కైవసం చేసుకున్న కూటమి
- పెన్సిల్ 'మార్కు' రాజకీయంతో 10 స్థానాల్లోనూ విజయం
- అధికార పార్టీకి కొమ్ముకాసిన కమిషనర్
- ఇన్‌వ్యాలీడ్ ఓట్లనూ పరిగణనలోకి తీసుకోవడంపై రచ్చ
- చివరి నిమిషం వరకూ ప్రలోభాలతో టీడీపీ నేతల ఎర
- అక్రమ విజయాన్ని రద్దు చెయ్యాలంటూ వైఎస్సార్‌సీపీ ఆందోళన

**అనుకున్నదే జరిగింది. అధికార పార్టీ అరాచకం ముందు.. నీతివంతమైన రాజకీయాలు మరోసారి ఓటమి పాలయ్యాయి. ఓవైపు ప్రలోభాలతో.. మరోవైపు బెదిరింపు రాజకీయాలతో కార్పొరేటర్లను భయపెట్టి.. డబ్బులతో లొంగదీసుకొని ఓట్లు వేయించుకున్నారు. డబ్బులు తీసుకున్న వారు ఓట్లు వేస్తారా లేదా అనే భయంతో అడ్డగోలుగా 'పెన్సిల్' మార్కు రాజకీయాలకూ తెరతీశారు. అక్రమాలతో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీని టీడీపీ అండ్ కో కైవసం చేసుకుంది. ఎన్నికల అధికారిగా నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన జీవీఎంసీ కమిషనర్.. అధికార పార్టీకి దాసోహమన్నారు. పార్టీ ఎమ్మెల్యేలు చెప్పినట్లుగానే వారికి కొమ్ముకాస్తూ చెల్లని ఓట్లను కూడా లెక్కింపులో భాగం చేస్తూ.. టీడీపీ కార్పొరేటర్లు విజయం సాధించేశారని ప్రకటించేశారు. కమిషనర్ వ్యవహారం, టీడీపీ నేతల తప్పుడు రాజకీయాన్ని ప్రతిఘటించిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నారు.**

సాక్షి, విశాఖపట్నం: జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు గందరగోళంగా మారాయి. ఉదయం 10.30 గంటలకు ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా సాయంత్రం లెక్కింపు సమయంలో తెలుగుదేశం పార్టీ నేతల బండారం బట్టబయలైంది. మొత్తం 97 మంది కార్పొరేటర్లుండగా.. సీపీఎం ఓటింగ్‌కు దూరంగా ఉంది. మిగిలిన 96 మంది కార్పొరేటర్లు మధ్యాహ్నం 2 గంటల వరకూ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓట్ల లెక్కింపులో టీడీపీ అభ్యర్థులు విల్లూరి భాస్కరరావు 66 ఓట్లతో, గొలగాని వీరారావు 65, పిసిని వరాహ లక్ష్మీనరసింహ 65, గల్లా పోలిపల్లి 64, బొమ్మిడి రమణ 64, బల్ల శ్రీనివాసరావు 60, శరగడం రాజశేఖర్ 60, నొల్లి నూకరత్నం 58, లక్ష్మీబాయి పులి 56, పిల్ల మంగమ్మ 54 ఓట్లతో విజయం సాధించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు సాడి పద్మావతికి 42, అక్కరమాని రోహిణికి 39, రెయ్యి వెంకటరమణకు 39, నక్కెళ్ల లక్ష్మికి 37, ఇమ్రాన్ మహమ్మద్ 36, తోట పద్మావతి 36, ముర్రు వాణి 36, పల్లా అప్పలకొండ 32, కె.వెంకటనాగ శశికళ 25, బిపిన్ జైన్ కుమార్‌కు 21 ఓట్లు పోలయ్యాయి. స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారికి కమిషనర్ ధ్రువపత్రాలు అందించారు.


జీవీఎంసీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు

**'పెన్సిల్' మార్కు రాజకీయాలు**

డబ్బులు తీసుకున్నవారు ఓట్లు వేస్తారా వెయ్యరా అని తెలుసుకునేందుకు టీడీపీ నేతలు కుయుక్తులు పన్నారు. విధుల్లో ఉన్న కొందరు జీవీఎంసీ, కోఆపరేటివ్ అధికారులతో ముందుగానే మాట్లాడుకున్నారు. ఇటీవల పార్టీలో చేరిన 14 మందికి 14 రకాల కలర్ పెన్సిళ్లు ఇచ్చారు. 'మీ బ్యాలెట్‌పై మీకిచ్చిన పెన్సిల్‌తో గీత పెట్టాల'ని ఆదేశించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం బ్యాలెట్ పత్రంపై ఏ విధమైన పెన్సిల్, పెన్, స్కెచ్ గీతలున్నా వాటిని ఇన్‌వ్యాలీడ్‌గా పరిగణించాలి. ఓట్ల లెక్కింపు సమయంలో ఈ గీతలను గమనించిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. చివర్లో చూద్దామంటూ కమిషనర్ దాట వేశారు. చివరికి వాటిని వ్యాలీడ్‌గా పరిగణించడంతో గొడవ మొదలైంది. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు పోర్టికోలో ధర్నాకు దిగారు. నినాదాలు చేసిన కార్పొరేటర్లను టీడీపీ నేతలు.. పోలీసు బలగాలతో నిలువరించారు. న్యాయం కోసం పోరాడుతున్న కార్పొరేటర్లను బయటికి పంపించెయ్యాలంటూ టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు ఆదేశిస్తుంటే పోలీసులు వారు చెప్పినట్లు చేస్తూ జులుం ప్రదర్శించారు. మహిళా కార్పొరేటర్లపైనా ప్రతాపం చూపించారు.

**'ఫోన్' కాల్‌తో మాట మార్చిన కమిషనర్**

ఎన్నికల లెక్కింపు సమయంలో కమిషనర్ పూర్తిగా 'పచ్చ'పాతంతో వ్యవహరించారు. మొదటి రౌండ్‌లో 5 ఓట్లపై పెన్సిల్ గీతలు గమనించిన కార్పొరేటర్ అక్కరమాని రోహిణి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీను రూల్‌బుక్‌లో ఉన్న నిబంధనలను కమిషనర్‌కు వినిపించి.. ఇన్‌వ్యాలీడ్ ఓట్లను పరిగణనలోకి తీసుకోవడం చట్టరీత్యా నేరమని చెప్పడంతో వాటిని పక్కన పెట్టారు. తర్వాత రౌండ్‌లో మరికొన్ని ఓట్లు ఇలా 14కి పైగా చెల్లని ఓట్లు ఉన్నట్లు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి

మిగతా 8వ పేజీలో

### రిసార్టు నుంచి నేరుగా..

అధికారంలోకి వచ్చిన మరుక్షణమే.. టీడీపీ అండ్ కో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీపై కన్నేసింది. వారి ప్రలోభాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీ నుంచి 12 మంది కార్పొరేటర్లు టీడీపీ, జనసేనలోకి వెళ్లిపోయారు. బలం పెరిగినా భయం నీడలోనే ఉన్న టీడీపీ నేతలు డబ్బు రాజకీయాలు మొదలు పెట్టారు. టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి గతంలో చేరిన ఓ మహిళా కార్పొరేటర్‌కు ఎమ్మెల్యే వెలగపూడి ఫోన్ చేసి ఓటు వెయ్యాలంటూ బెదిరించారు. అలాగే తమ అభ్యర్థులకు ఓటు వేస్తే రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ ఇస్తామని ప్రలోభాలు పెట్టి.. మంగళవారం రాత్రి స్వయంగా ఎమ్మెల్యేల కార్లలోనే సొమ్ము పంపిణీ చేశారు. మద్దతు పలికిన వారిని భీమిలిలోని రిసార్టుకు తరలించి.. అక్కడి నుంచి బస్సు, కార్లలో నేరుగా బుధవారం 12 గంటల సమయంలో పోలింగ్ కేంద్రం వద్దకు తీసుకొచ్చారు.


రిసార్టు నుంచి బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్న కార్పొరేటర్లు

## క్లుప్తంగా

### రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

ఎస్.రాయవరం: నర్సీపట్నం రోడ్డు గుల్లిపాడు రైల్వే స్టేషన్ల నడుమ రైలు జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారూఫ్ బుధవారం తెలిపారు. నర్సీపట్నం రోడ్డు రైల్వే నుంచి తుని వైపు వెళుతున్న రైలు నుంచి సుమారు 40 ఏళ్ల వయసు గల వ్యక్తి మృతి చెందినట్టు తెలిపారు. రైలు ప్రమాదంలో మృతుని శరీరభాగాలు తెగిపడగా, శరీరంపై తెలుపురంగుపై ఎరుపురంగు సన్నని నిలువు చారల చొక్కా, ముక్కుపొడి రంగు లోయర్ ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని తుని రైల్వే ఆస్పత్రిలో భద్రపరిచామన్నారు. వివరాలు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

### బైకును ఢీకొని పల్టీ కొట్టిన కారు


పొలాల్లోకి పల్టీ కొట్టిన కారు

నక్కపల్లి: జాతీయ రహదారిపై ఒడ్డిమెట్ట సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. ముకుందరాజుపేటకు చెందిన మామిడి రాంబాబు తన భార్య సత్యవతితో కలిసి తుని నుంచి ఇంటికి వస్తుండగా వెనుక నుంచి అచ్చుతాపురం మండలం గొర్లె ధర్మవరం గ్రామానికి చెందిన నూకరాజు మరికొంతమంది కారులో తుని నుంచి నక్కపల్లి వైపు వస్తూ రాంబాబు బైక్‌ను ఢీకొట్టారు. దీంతో కారు అదుపు తప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న రాంబాబు, అతని భార్య తీవ్రంగా గాయపడ్డారు. కారులో ఉన్న మరో ఇద్దరు కూడా స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులు నలుగురిని 108 వాహనంలో తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# కళాసృష్టి అతనికి వర 'ప్రసాద'ం

కళాకృతుల రూపకల్పనకు ప్రసాద్ పెట్టింది పేరు. చిత్రకళపై చిన్నప్పటి నుంచి ఉన్న ఆసక్తి ఆయనను కళాసృష్టికి పురిగొల్పింది. పెన్సిల్ ముల్లు, సుద్ద ముక్క, సబ్బు బిళ్ల ఇలా ఏ వస్తువైనా అతని చేతిలో అందమైన కళాకృతిగా రూపుదిద్దు కుంటుంది. బియ్యపు గింజపై కూడా చిత్రాలు గియ్యడంలో ఆయన నేర్పరి. అయన గీసిన చిత్రాలు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం పొందాయి.

- సుద్ద ముక్క, సబ్బు బిళ్ల... చేయి తగిలితే అందమైన బొమ్మ
- లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు
- కె.జె.పురం గ్రామానికి వన్నె తెచ్చిన ప్రసాద్


ప్రసాద్ కళా నైపుణ్యానికి అద్దం పట్టే చిత్రం


అందమైన గాజు సీసాలో ఛత్రపతి శివాజీ


జీవం ఉట్టిపడుతున్న కళాకృతి


రంగులద్దిన అందమైన ప్రకృతి చిత్రం


ప్రసాద్ సాధించిన అవార్డులు, పురస్కారాలు

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు శరగడం అచ్యుత గంగకన్న వరప్రసాదు బాల్యంలో మట్టితో వినాయకుని ప్రతిమలు, ఆటవస్తువులు తయారు చేసేవారు. ఉన్నత విద్యాభ్యాసం సమయంలో సుద్ద ముక్కలపై చేతి గోటితో శిల్పాలు చెక్కేవారు. ఇంటర్ చదువుతున్న సమయంలో ప్రయోగశాలల్లో ఉపయోగించే సూదులతో సుద్దముక్కలపై శిల్పాలు చెక్కడం ప్రారంభించారు. డిగ్రీ చదివేటప్పుడు సబ్బులతో శిల్పాలు తయారు చేసి శభాష్ అనిపించుకున్నారు. ఈ విధంగా ప్రసాదు క్రమంగా సూక్ష్మ కళపై మక్కువతో వివిధ రూపాలు చెక్కారు. బీఎస్సీ బయోకెమిస్ట్రీ పూర్తి చేసిన ప్రసాదు 108 సర్వీసులో ఇ.ఎం.టి గా పనిచేస్తున్నారు. ఖాళీ సమయంలో ఆయన తన సృజనాత్మకతకు పదును పెడుతున్నారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన ప్రసాద్ ఖాళీ సీసాల్లో కళా ఖండాలు చెక్కారు. సీసా లోపల తాజ్‌మహల్, సాయిబాబా, వేంకటేశ్వర స్వామి, ఛత్రపతి శివాజీ రూపాన్ని ఖాళీ గాజుసీసా లోపల చిత్రించి అబ్బురపరిచారు. పెన్ను రీఫిల్స్‌తో చిన్న చిన్న బొమ్మలు, పెన్సిల్ ముల్లుతో దేశ నాయకులు బొమ్మలు రూపొందించడంలో కూడా ప్రసాద్ దిట్ట. 2008లో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో సీటు వచ్చింది. కానీ అనివార్య కారణాల వల్ల చేరలేకపోయినట్టు ప్రసాద్ తెలిపారు.

**మ్యూరల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం.**

మ్యూరల్ ఆర్ట్‌పైన కూడా ప్రసాద్‌కు మక్కువ ఎక్కువే. తన ఇంట్లో మేడ మీద పుట్టీలు పెట్టారు. ఇంట్లో సజీవ చిత్రాలు గీస్తున్నారు. గోడలపై పుట్టి, జిప్సమ్, కలిపి కావాలసిన బొమ్మగా మలిచి ఆరిన తర్వాత రంగులు అద్ది అద్భుత ప్రకృతి సౌందర్యాన్ని ఇంట్లోనే ఆవిష్కరించారు.

### అవార్డుల నీరాజనాలు

ప్రసాదు కళాసృష్టికి ఎన్నో పురస్కారాలు పొందారు. ఉత్తమ సృజనాత్మక ఆర్టిస్టుగా 2007 ఆగస్టు 15న హైదరాబాదులో ఈఎంఆర్ సంస్థ అవార్డు అందుకున్నారు. అలాగే..

- 2009లో అదే సంస్థ వారు విశాఖలో ఉత్తమ ఆర్టిస్టు అవార్డు అందించారు.
- 1999లో తుమ్మపాలలో గౌరీ సేవా సంఘం సత్కారం.
- 2019లో హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం.
- 2019లో హర్యానాలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ నేషనల్ రేంజ్ సంస్థ పురస్కారం.
- 2019లో హైదరాబాద్‌లో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారం.
- న్యూఢిల్లీకి చెందిన బెస్ట్ ఆఫ్ ఇండియా రికార్డు అవార్డు
- తాజాగా ఇంటర్ నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రశంసాపత్రం

### ప్రోత్సాహంతోనే కళకు మనుగడ



విద్యార్థుల్లో సృజనాత్మకత పెరగాలి. కళ పట్ల ఆసక్తి ఉన్నా ఎందరో గ్రామీణ విద్యార్థులు వనరులు లేక వెనుకబడి పోతున్నారు.విద్యార్థుల్లో వున్న ఆసక్తిని తల్లిదండ్రులు గమనించి ప్రోత్సాహం అందించాలి. అప్పుడే ఎందరో కళాకారులు రూపుదిద్దుకుంటారు.

–శరగడం అచ్యుత గంగకన్న వరప్రసాద్

# నేతన్నలకు డిజైనర్లతో ప్రత్యేక శిక్షణ

- తయారుచేసిన వస్త్రాలకు గిట్టుబాటు ధర
- కొత్త టెక్నాలజీలో నేతన్నలకు భాగస్వామ్యం
- ముడి సరుకు సరఫరా చేసేందుకు చర్యలు
- చేనేత దినోత్సవంలో కలెక్టర్ విజయ కృష్ణన్


సీనియర్ నేత కార్మికుడిని సన్మానిస్తున్న కలెక్టర్

నక్కపల్లి: జిల్లాలో చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కె.విజయ కృష్ణన్ భరోసానిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పాయకరావుపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చేనేత కార్మికులు తయారు చేస్తున్న వస్త్రాలను పరిశీలించారు. మగ్గాల పనితీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. చేనేత కార్మికుల కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. వస్త్రాల తయారీలో మార్కెట్లోకి వచ్చిన కొత్త టెక్నాలజీకి గ్రామీణ ప్రాంత నేత కార్మికులు అప్‌గ్రేడ్ అవ్వాలన్నారు. అవసరమైతే టెక్నాలజీని నేత కార్మికులకు చేరువ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డిజైనర్లతో ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే చేనేత కార్మికుల కోసం ప్రత్యేకంగా అవగాహన సదస్సు నిర్వహించి, స్కీముల గురించి వివరిస్తామన్నారు. గాంధీజీ స్వయంగా నూలు వడికి, వస్త్రాలు తయారు చేసి, వాటినే ధరించేవారని, చేనేత రంగానికి అంతటి ప్రాధాన్యత రావడానికి అదే కారణమన్నారు. వస్త్రాల్లో రోజురోజుకూ సరికొత్త డిజైన్లు ఆవిష్కృతమవుతున్నాయని, వాటికి అనుగుణంగా తయారు చేసినపుడే మార్కెట్లో చేనేత వస్త్రాలకు డిమాండ్ ఉంటుందన్నారు.

పలువురు నేత కార్మికులు మాట్లాడుతూ ముడి సరకు కొనుగోలుకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని కోరారు. నేతన్న నేస్తం కింద ఇప్పటి వరకు ఇచ్చిన ప్రభుత్వ సాయాన్ని కొనసాగించాలని, తాము తయారు చేసిన వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని అభ్యర్థించారు. పాయకరావుపేటలో శిథిలావస్థకు చేరిన సొసైటీ భవనానికి మరమ్మతులు చేయించాలని, గతంలో వైఎస్సార్ హయాంలో ఏర్పాటు చేసిన ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రాన్ని తిరిగి ప్రారంభిస్తే పలువురికి ఉపాధి లభిస్తుందని కోరారు. కలెక్టర్‌కు స్థానిక నేత కార్మికులు రూపొందించిన జమదాని చీరను బహూకరించారు. కలెక్టర్ చేతుల మీదుగా సీనియర్ నేత కార్మికులను సన్మానించారు. అనంతరం నేత కార్మికులతో పాయకరావుపేటలో ర్యాలీ నిర్వహించారు.

## మాడుగుల హల్వా రుచికి సినీ నటుడు సమీర్ ఫిదా


మాడుగుల హల్వా రుచి చూస్తున్న సినీనటుడు సమీర్

మాడుగుల: మాడుగుల దంగేటి హల్వాకు అనేక ఏళ్ల నుంచి విశేష ఆదరణ ఉంది. ఈ నేపథ్యంలో పాడేరు షూటింగ్‌కు వచ్చిన ప్రముఖ సినీ నటుడు సమీర్ హల్వా రుచి చూడడానికి ప్రత్యేకంగా మాడుగుల వచ్చారు. దంగేటి గోపీ కృష్ణ హల్వా షాపులో హల్వా రుచి చూశారు. మాడుగులలో తయారయ్యే హల్వా హైదరాబాద్‌లో స్టాల్స్‌లో కొనుగోలు చేసి తినేవారమని, స్వయంగా దంగేటి వారు తయారు చేసిన హల్వా తినడం, చాలా ఆనందంగా ఉందని చెప్పారు. పార్శిల్స్ తీసుకువెళ్లారు. అత్తారింటికి దారేది, మగధీర, డాడీ లాంటి సినిమాలో నటించి ప్రేక్షకుల ఆదరణ పొందిన సమీర్ రాకతో స్థానికంగా సందడి నెలకొంది.

## హైడ్రో ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సీపీఎం నిరసన


గిరిజనులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు వెంకన్న, దొర

దేవరాపల్లి: సరియా జలపాతానికి ఆనుకొని దట్టమైన అటవీ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు పనులు గుట్టు చప్పుడు కాకుండా జరిగిపోతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర అన్నారు. హైడ్రో ప్లాంట్ ప్రాంతాన్ని బుధవారం పరిశీలించిన అనంతరం స్థానిక గిరిజనులతో కలిసి నిరసన తెలిపారు. అదాని కంపెనీ చేతుల్లోకి అడవులన్నీ వెళ్లిపోతున్నాయని, గిరిజన బతుకులు బుగ్గిపాలు కావడంతో పాటు వన్య ప్రాణులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. కోనాం జలాశయం ఆయకట్టు భూములు ఎడారిగా మారడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేశారు. అదాని కంపెనీకి చెందిన ప్రతినిధులు, ఫారెస్టు అధికారులు సర్వే నిర్వహించడంపై వారు అగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో హైడ్రో ప్రాజెక్టు నిర్మాణంతో అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలోని వాలాబు పంచాయతీ పరిధిలోని సగం మేర గ్రామాలు, అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలోని సరియా, మాద్రేబు, మాకనాబిల్లి, దాయిర్తి గ్రామాల నష్టం జరుగుతుందన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతులను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కె.రాముడు, రామకృష్ణ, రవికుమార్ పాల్గొన్నారు.

## శారదానదిలో జారిపడి తాపీ మేస్త్రి మృతి


కొమ్మనాపల్లి అమ్మతల్లి మృతదేహం

దేవరాపల్లి: దేవరాపల్లికి చెందిన తాపీ మేస్త్రి కొమ్మనాపల్లి అమ్మతల్లి(39) శారదానదిలో ప్రమాదవశాత్తూ పడి మృతి చెందాడు. దేవరాపల్లి శారదానది వంతెనకు సమీపంలో పడి ఉన్న అతని మృతదేహాన్ని బుధవారం ఉదయం అటుగా బహిర్భూమికి వెళ్లిన స్థానికులు గుర్తించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. స్థానిక ఎస్ఐ డి.నాగేంద్ర కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దేవరాపల్లికి చెందిన కొమ్మనాపల్లి అమ్మతల్లి మంగళవారం సాయంత్రం చేపల వేటకు శారదానదికి వెళ్లి చేపల వేట చేస్తుండగా ప్రమాదవశాత్తూ కాలుజారి శారదానది పడిలో మృత్యువాత పడ్డాడు. అమ్మతల్లికి మూర్ఛ వ్యాధి ఉండడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో కుమారుడి మృతదేహం వద్ద తల్లి పార్వతి కన్నీరు మున్నీరుగా విలపించింది. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ డి.నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## హైవే సేఫ్టీ వాహనాన్ని ఢీకొన్న లారీ

డ్రైవర్ మృతి


ప్రమాదంలో నుజ్జయిన లారీ ముందుభాగం

యలమంచిలి రూరల్: మండలంలోని పోతురెడ్డిపాలెం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ పైలా సింహాచలం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 16వ నంబరు జాతీయ రహదారిపై యలమంచిలి మండలం పోతురెడ్డిపాలెం సమీపంలో రహదారి నిర్వహణ పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా రహదారిపై వాహనాల రాకపోకలను పక్కనుంచి సాగించేలా నిర్వహణ సంస్థ ఉద్యోగులు మళ్లించారు. నిర్వహణ పనుల్లో భాగంగా రోడ్డుపై నిలిపి ఉంచిన హైవే సేఫ్టీ వాహనాన్ని అనకాపల్లి నుంచి తుని వైపు వెళ్తున్న లారీ ఢీకొంది.ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ జయంత్ పాల్(49) తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు.ఆస్పత్రి మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచారు. మృతి చెందిన డ్రైవర్ కుటుంబ సభ్యులకు ప్రమాద సమాచారాన్ని అందజేశామని, వారు ఇక్కడకు వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు. కాగా ఈ ప్రమాదం కారణంగా కొంతసేపు పోతురెడ్డిపాలెం వద్ద వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.సమాచారం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.హైవే నిర్వహణ పనులను తమ ఇష్టారాజ్యంగా చేపడుతున్నారని పలువురు వాహన చోదకులు ఆరోపించారు.హైవేకు ఒకవైపు మాత్రమే నిర్వహణ పనులను చేపట్టడంతో పాటు రెండు కిలోమీటర్ల ముందు పనులు జరుగుతున్నట్టు సూచికలు ఏర్పాటు చేయాల్సి ఉంది.ఇవేమీ పట్టించుకోకుండా రెండు వైపులా పనులు చేపట్టడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడంతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నిబంధనలకు విరుద్ధంగా హైవే నిర్వహణ పనులు చేపడుతున్న సంస్థపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పలువురు వాహన చోదకులు కోరుతున్నారు.

## మహిళపై దాడి చేసిన వారిపై కేసు నమోదు

రాంబిల్లి (యలమంచిలి): మహిళపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు రాంబిల్లి సీఐ సిహెచ్.నర్సింగరావు బుధవారం రాత్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు మేరకు మండలంలో గజరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఎరిపిల్లి నూకమ్మపై అదే గ్రామానికి చెందిన ఎరిపిల్లి నూకమ్మ ఎరిపిల్లి మధు అనే ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన ఘటనలో ఇరువురిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

# 9న క్విట్ కార్పొరేట్..సేవ్ ఇండియా


సమావేశంలో మాట్లాడుతున్న కర్రి అప్పారావు

అనకాపల్లి: మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టి ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని కిసాన్ సంయుక్త మోర్చ జిల్లా కన్వీనర్ కర్రి అప్పారావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో కిసాన్ సంయుక్త మోర్చ, కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ సమావేశం ఏఐటీయూసీ అధ్యక్షుడు వై.ఎస్.భద్రం ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర చట్టం చేయలేదని, కేంద్ర బడ్జెట్లో ఎరువులు, పురుగు మందులకు సబ్సిడీలు ఎత్తివేసారని, కార్మికులకు నష్టం కలిగించే చర్యలు చేపడుతున్నారని ఆరోపించారు. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వాడిని వెళ్లగొట్టడానికి ఆగస్టు 9న క్విట్ ఇండియా పిలుపుని అనాడు గాంధీ ఇచ్చారని, నేడు కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం విధానాలను ప్రజలంతా వ్యతిరేకించాలని అన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్లో కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇచ్చి, ఉపాధి హామీ పథకానికి నిధులు కోత పెట్టారని, పౌష్టిక ఆహార లోపంతో దేశంలో ప్రజలు ఉంటే ఐసీడీఎస్ బడ్జెట్‌కి రూ. 300 కోట్లు నిధులు తగ్గించారని అన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.దొరబాబు మాట్లాడుతూ బీజేపీ విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సంయుక్త మోర్చ కో కన్వీనర్ బాలు గాడి , కౌలు రైతు సంఘం కోశాధికారి కె. తాలయ్య బాబు, రైతు సంఘం నాయకులు కొరుబిల్లి శంకరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం, సీఐటీయు జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు, నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

# దివ్యాంగ పిల్లల సమగ్ర అభివృద్ధికే భవిత కేంద్రాలు


భవిత కేంద్రంలో దివ్యాంగులకు ఇస్తున్న ఫిజియోథెరఫీని పరిశీలిస్తున్న జిల్లా అధికారి శకుంతల

చోడవరం రూరల్: దివ్యాంగ పిల్లల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా జిల్లాలోని సమగ్ర శిక్ష భవిత కేంద్రాలు పనిచేస్తున్నట్టు సహిత విద్య జిల్లా సమన్వయకర్త శకుంతల తెలిపారు. స్థానిక భవిత కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించి, దివ్యాంగులకు అందచేస్తున్న ఫిజియోథెరపీ సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 1,485 మంది దివ్యాంగ పిల్లల సంక్షేమం కోసం రూ.37.86 లక్షలు విడుదలైనట్టు తెలిపారు. ఈ మొత్తాన్ని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ట్రాన్స్‌పోర్ట్, ఎస్కార్ట్, హోమ్ బేస్డ్ అలవెన్సులతో పాటు గర్ల్స్ స్టయిఫండ్‌గా అందజేసినట్టు చెప్పారు. దివ్యాంగ విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లను వారు ఏ విధంగా వినియోగిస్తున్నదీ, విద్యార్జనలో అవి ఏవిధంగా వారికి ఉపకరిస్తున్నదీ స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు సత్యనారాయణ, రమేష్, ఫిజియోథెరపిస్టు లావణ్య, దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నైతిక నాయకత్వం అలవరచుకోవాలి

**విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ మోహన్ కందా**



మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ మోహన్ కందా

యలమంచిలి రూరల్: విద్యార్థి దశలోనే నైతిక నాయకత్వం అలవరుచుకోవాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్ కందా తెలిపారు.బుధవారం రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులతో జరిగిన జాతీయ ఆన్‌లైన్ సెమినార్‌లో ఆయన ముఖ్య ఉపన్యాసం చేశారు.నాయకత్వం,నైతికతను సమన్వయం చేసుకోవడంలోనే చేసే ఉద్యోగం,వ్యాపారం,సంస్థల నిర్వహణ విజయం ఆధారపడి ఉంటుందని చెప్పారు.ఒక ఐఏఎస్ అధికారిగా తన అనుభవాలను ఆయన విద్యార్థులతో పంచుకున్నారు.అనుభవం అనేది జీవితంలో ఎన్నో పాఠాలను నేర్పుతుందని చెప్పారు. విద్యార్థి దశలో నాయకత్వ లక్షణాలు అలవాటు చేసుకున్న వారికి భవిష్యత్తులో తాము చేసే పనిలో భయం ఉండదన్నారు.జీవితంలో ఉన్నతశిఖరాలకు చేరుకోవడానికి ఆయన పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కొందరు అడిగిన ప్రశ్నలకు మోహన్ కందా తనదైన శైలిలో ఇచ్చిన సమాధానాలు విద్యార్థుల్లో ఉత్సాహం,ఆసక్తిని కలిగించాయి. ఈ సదస్సులో స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్,ఫిజికల్ డైరెక్టర్ పోలిరెడ్డి,అధ్యాపకులు రేఖా రామారావు, వి.చిట్టిబాబు, ఎం.కిషోర్,విద్యార్థులు పాల్గొన్నారు.

## సీపీఎం నాయకులపై కేసు కొట్టివేత


కోర్టు ప్రాంగణం వద్ద సీపీఎం నాయకులు

యలమంచిలి రూరల్ : గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రుల అడ్డగింపు, పోలీసుల విధులకు ఆటంకంపై అచ్యుతాపురం పోలీస్‌స్టేషన్‌లో సీపీఎం నాయకులపై నమోదు చేసిన క్రిమినల్ కేసును బుధవారం యలమంచిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టు కొట్టివేసినట్లు న్యాయవాది శరగడం అప్పలనాయుడు తెలిపారు. 2017లో అచ్యుతాపురం కేజీబీవీ పాఠశాలలో విద్యార్థిని మృతి చెందింది. పరామర్శించేందుకు అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు రాగా, విద్యార్థిని మృతికి న్యాయం చేయాలంటూ సీపీఎం నేతలు, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేశారు. ఈ ఘటనకు సంబంధించి క్రైం నెం.248/2017తో అచ్యుతాపురం పోలీసు లు సీపీఎం నాయకులు రొంగలి రాము, కె.సోమునాయుడు, వై.అప్పలరాజు, ఎస్.నాయుడులపై కేసు నమోదైంది. తుది విచారణలో కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

## కుట్ర పన్ని.. కాసులు కుమ్మరించి..!

▶7వ పేజీ తరువాయి


కార్పొరేటర్ పద్మారెడ్డిపై పోలీసు ప్రతాపం

తెలిపారు. వీటన్నింటినీ తొలుత కమిషనర్ పక్కనపెట్టారు. లెక్కింపు చివరి దశకు వచ్చిన సమయంలో కమిషనర్‌కు ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్‌లో మాట్లాడిన తర్వాత మళ్లీ వచ్చిన కమిషనర్ ఇన్‌వ్యాలీడ్ ఓట్లన్నీ వ్యాలీడ్ ఓట్లుగా పరిగణిస్తున్నామని మాట మార్చారు.

**వైఎస్సార్‌సీపీదే నైతిక విజయం**

కుట్రలు, కుతంత్రాలు, డబ్బు రాజకీయాలతో స్టాండింగ్ కమిటీలో కూటమి కార్పొరేటర్లు విజయాన్ని తారుమారు చేశారని, పారదర్శక రాజకీయాలు చేసిన వైఎస్సార్‌సీపీదే నైతిక విజయమని మేయర్ హరివెంకటకుమారి అన్నారు. అధికారులు నిస్పక్షపాతంగా వ్యవహరించి ఇన్‌వ్యాలీడ్ ఓట్లను పరిగణనలోకి తీసుకోకుంటే కనీసం రెండు నుంచి మూడు స్థానాల్లో విజయం సాధించేవాళ్లమన్నారు.

## క్లుప్తంగా

### 'వరి ఆకు చివర్లు తుంచి నాటుకోవాలి'



వరి నాట్లు వేసే విధానాన్ని క్షేత్ర స్థాయిలో రైతులకు వివరిస్తున్న స్వప్న

కశింకోట: వరి ఆకు చివర్లు తుంచి నాటుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న రైతులకు సూచించారు. మండలంలోని వెదురుపర్తి గ్రామంలో పొలం బడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ వరి సాగులో మెలకువలను రైతులకు వివరించారు. వరి ఆకు చివర్లు తుంచడం వల్ల చేను ఏపుగా ఎదుగుతుందన్నారు. వరి నాట్లను ఏ విధంగా నాటాలో క్షేత్ర స్థాయిలో రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ద్రవ జీవామృతం తయారీ, దాని ఉపయోగాలను తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

### భద్రతపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు సూచనలిస్తున్న సీఐ బాలసూర్యారావు

పరవాడ: రహదారి భద్రతపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సీఐ ఎస్.బాలసూర్యారావు సూచించారు. విద్యార్థులకు రోడ్డు భద్రత, ర్యాగింగ్, సైబర్ క్రైం వంటి అంశాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ర్యాగింగ్ వంటి కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ క్రైం నేరగాళ్లతో జాగ్రత్తగా వ్యవహరించాలని సీఐ బాలసూర్యరావు చెప్పారు.

### కార్మిక పక్షపాతి సూర్యనారాయణ



కార్మిక నేత సూర్యనారాయణకు నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: కార్మిక హక్కుల కోసం నిస్వార్థంగా పోరాడిన కార్మిక నేత ఎం.సూర్యనారాయణ మృతి చెందడం ఉద్యమానికి తీరని లోటని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. పరవాడలో బుధవారం ఏర్పాటు చేసిన సీఐటీయూ మాజీ జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ సంతాప సభ నిర్వహించారు. ముందుగా సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం నుంచి కష్ట జీవుల కోసం పని చేసిన సూర్యనారాయణ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో ఎం.సంతోష్‌కుమార్, పి.అప్పలరాజు, పి.పైడిరాజు, భరత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.రమణ, ఎ.బంగ్రరాజు పాల్గొన్నారు.

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| శివం భజే | : రాజా |
| కల్కి2898 ఏడీ | : సత్యనారాయణ స్క్రీన్-1 |
| బడ్డీ | : సత్యనారాయణ స్క్రీన్-2 |
| అలనాటి రామచంద్రుడు | : పర్తిసాయి |
| డార్లింగ్ | : షిర్డిసాయి |
| తిరగబడరస్వామి | : వెంకటేశ్వర |
| పురుషోత్తముడు | : శ్రీసత్య |
| ఉషాపరిణయం | : రామచంద్ర |

### రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 28 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 359 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 328 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.



# సాగు బాటలో రైతన్న

ఇటీవల కురిసిన భారీ వానలు ఆకు మడులకు ఆటంకాలు కలిగించాయి. అయితే నీటి నిల్వల్ని మాత్రం పెంచాయి. దీంతో రైతులు ధీమాగా పొలాల్ని దమ్ముపట్టి, నాట్లు వేసే పనిలో పడ్డారు. కశింకోట మండల పరిధిలో ఈ ఏడాది సాధారణ సాగు విస్తీర్ణ(909 హెక్టార్లు)న్ని మించి వరి నాట్లు జరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షాలకు ఆకు మడులు దెబ్బతిన్న ప్రాంతాల్లో రైతుల నిర్ణయంపైనే ఇది ఆధారపడి ఉంది. ప్రస్తుతం 120 ఎకరాల్లో వరి నాట్లు పడ్డాయి.

- నారు, నీరు ఉన్న చోట ఖరీఫ్ వరి నాట్లు
- ఈ ఏడాది సాధారణ సాగు లక్ష్యం 909 హెక్టార్లు
- వెయ్యి హెక్టార్లకు చేరుకుంటుందని అధికారుల అంచనా
- వర్షాలకు నారు దెబ్బతిన్న చోట నాట్లు మరింత ఆలస్యం



నాటిన వరి నాట్లు



కశింకోటలో వరి నాట్లు వేస్తున్న మహిళలు



నూతలగుంటపాలెంలో వరి నాట్లు వేయడానికి ట్రాక్టర్ సాయంతో ఊబాలు వేస్తున్న రైతు

కశింకోట: మండలంలో ఖరీఫ్ వరి నాట్లు వేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. నీటి సదుపాయం, వరి నారు అందుబాటులో ఉన్నచోట నాట్లు జోరుగా జరుగుతున్నాయి. ఇప్పటికే సుమారు 120 ఎకరాల్లో నాట్లు వేసినట్లు సమాచారం. కూలీల కొరత కూడా నాట్లు వేయడంలో జాప్యానికి ఓ కారణం. ఇటీవల కురిసిన భారీ వర్షాల్లేకుంటే ఈసరికే చాలా వరకు నాట్లు జరిగేవి. భారీ వర్షాల కారణంగా నాట్లు వేయడంలో జాప్యం నెలకొందని అధికారులు చెప్తున్నారు.

**ఖరీఫ్‌లో వరి సాగుకు ప్రాధాన్యం**

మండలంలో ఏటా ఖరీఫ్ సీజన్లో వరి సాగు చేస్తుంటారు. కశింకోట, తాళ్లపాలెం, వెదురుపర్తి, బయ్యవరం, తేగాడ, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, జమాదులపాలెం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, తాళ్లపాలెం, ఏఎస్ పేట, గొబ్బూరు, నరసింగబిల్లి, చింతలపాలెం, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, అచ్చెర్ల, సింగవరం, జి.భీమవరం, సుందరయ్యపేట, కన్నూరుపాలెం, తీడ, చెరకాం, సోమవరం తదితర గ్రామాల్లో వర్షాధారంగానే వరి సాగు జరుగుతుంది. కొన్ని చోట్ల బోర్ల సాయంతో సాగు చేస్తారు. ఎక్కువ శాతం పంట భూములకు శారదానది నీరు గ్రోయిన్ల నుంచి సాగు నీటి కాలువల ద్వారా పంట భూములకు సరఫరా అవుతుంది. వీటికి తోడు చెరువులు, కొండగెడ్డలు, రంగబోలు జలాశయం వరి సాగుకు అదనపు భరోసా.

**నాట్లకు సిద్ధంగా రైతులు**

ప్రస్తుతం సాగు నీరు, ఎదిగిన వరి నారు అందుబాటులో ఉన్నచోట్ల రైతులు నాట్లు చేపడుతున్నారు. మరికొందరు భూములను దుక్కి దున్ని సిద్ధం చేస్తున్నారు. దమ్ము పట్టి, ఊబాలు వేస్తున్నారు. పొలం గట్లను గడ్డి లేకుండా శుభ్రం చేయడంతోపాటు, నీరు పోకుండా పటిష్ట పరుస్తున్నారు. గత ఏడాది ఖరీఫ్ వరి సాగు దాదాపు 1200 హెక్టార్లలో జరిగింది. సాధారణ విస్తీర్ణాన్ని మించి సుమారు 300 హెక్టార్లలో అదనంగా వరి నాట్లు వేశారు. ఈ ఏడాది 909 హెక్టార్లు సాధారణ విస్తీర్ణంగా నిర్ణయించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వెయ్యి హెక్టార్లకు వరి సాగు చేరవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. భారీ వర్షాల్లేకుంటే గత ఏడాదిని మించి నాట్లు పడేవని చెప్తున్నారు.

**కొత్త నారు పైనే ఆశలు**

నూతలగుంటపాలెం, నరసింగబిల్లి, జెట్టపురెడ్డితుని, చింతలపాలెం, గొబ్బూరు, ఏఎస్ పేట, సోమవరం తదితర ప్రాంతాల్లో వాతావరణం అనుకూలిస్తే ఇప్పటికే చాలా వరకు నాట్లు పూర్తవ్వాలి. భారీ వర్షాలకు వరి నారుమళ్లు మునిగి దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల నారు ఎదుగుదల లోపించింది. అవకాశం ఉన్న వారు మళ్లీ నారుమళ్లు వేశారు. అవి ఎదిగే వరకు ఆగాల్సిందే. దీంతో నాట్లు వేయడంలో ఆలస్యం జరుగుతోంది. వాతావరణం అనుకూలిస్తే కొత్త నారు మడులు అందుబాటులోకి వచ్చి, సాగు విస్తీర్ణం పెరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు కూలీల కొరత కూడా వేధిస్తోందంటున్నారు.

**సాగు విస్తీర్ణం పెరుగుతుంది**

మండలంలో ఈ ఏడాది సాధారణ వరి సాగు విస్తీర్ణం 909 హెక్టార్లుగా నిర్ణయించారు. వాతావరణం అనుకూలించి వర్షాలు పడితే లక్ష్యాన్ని అధిగమించి, వరి నాట్లు జరిగే అవకాశం ఉంది. గత నెలలో అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు లేకుంటే ఇప్పటికే చాలా వరకు నాట్లు జరిగేవి. భారీ వర్షాలతో నారు ఎదుగుదల లేక నాట్లు ఆలస్యమయ్యాయి. ఇప్పటికి 120 ఎకరాల్లో నాట్లు జరిగాయి. మిగిలిన విస్తీర్ణంలో కూడా వేగంగానే నాట్లు పూర్తవుతాయనుకుంటున్నాం.

– ఎం.స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట

### 'చెర్లోపలి గ్రోయిన్ ఆయకట్టుకు నీరందించండి'

అనకాపల్లి: శారదా నది చెర్లోపలి గ్రోయిన్ కింద ఉన్న ఆయకట్టుకు సాగు నీరు అందించి రైతుల్ని ఆదుకోవాలని సీపీఎం జోన్ కార్యదర్శి వైఎస్ భద్రం కోరారు. మండలంలోని తుమ్మపాల శారదానది గ్రోయిన్‌లను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వేలాది ఎకరాలకు సాగు నీరు అందించాల్సిన గ్రోయిన్ ఆనకట్ట తలుపులు మరమ్మతుకు గురై, నీరు వృథాగా నదిలోకి పోతోందన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం ఆక్షేపణీయమన్నారు. తక్షణమే గ్రోయిన్ ఆనకట్టకు మరమ్మతులు చేపట్టాలన్నారు. లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు శంకరరావు, పొలమరశెట్టి రమణబాబు, మాదేటి సూర్యప్రకాష్‌రావు, కొణతాల మాణిక్యాలరావు, బుద్ధ శివాజీ, కొణతాల గణేష్ పాల్గొన్నారు.

### విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లి: మండలంలోని మూలపేటకు చెందిన ఇంటర్ విద్యార్థిని అదృశ్యంపై పట్టణ పోలీసులకు బుధవారం ఫిర్యాదు అందింది. పట్టణ ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు. బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి వస్తానని చెప్పి విద్యార్థిని బయలుదేరింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో ఆమె స్నేహితులు, బంధువుల ఇళ్లలో ఆరా తీశారు. అయినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో విద్యార్థిని అన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

అనకాపల్లి: స్థానిక సుంకరమెట్ట జంక్షన్‌వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమ మద్యం బాటిళ్లతో ఓ వ్యక్తి పోలీసులకు చిక్కాడు. పట్టణ ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు. సబ్బవరం మండలానికి చెందిన గనిశెట్టి అప్పారావు 10 క్వార్టర్ బాటిళ్ల మద్యం తరలిస్తున్నాడు. పోలీసుల వాహన తనిఖీల్లో పట్టుబడటంతో అప్పారావుపై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

## ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



కొత్తూరు గ్రామంలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ



తుమ్మపాలలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ



కశింకోటలో తల్లిపాల వారోత్సవాల్లో మానవహారంగా ఏర్పడ్డ ఐసీడీఎస్ సిబ్బంది



మండల పరిషత్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో సిబ్బంది

అనకాపల్లి: పట్టణ, మండలంలోని పలు ప్రాంతాల్లో తల్లిపాల వారోత్సవాల ముగింపు ర్యాలీలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని తుమ్మపాల, కొత్తూరు, సంపతిపురం, టి.వెంకుపాలెం, వేటజంగాలపాలెం, గోపాలపురం, అక్కిరెడ్డిపాలెం, మారేడుపూడి, మామిడిపాలెం, పట్టణ పరిధిలోని ఐదు వార్డుల పరిధిలో తల్లిపాల వారోత్సవాల చివరి రోజు కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ బిడ్డ జన్మించిన వెంటనే తల్లి పాలు బిడ్డకు ఇవ్వడంతో తల్లీబిడ్డ ఆరోగ్యంగా జీవిస్తారని తెలిపారు. ఆరు మాసాలపాటు తల్లిపాలే శిశువుకు రోజూ 8 నుంచి 10 సార్లు అందించాలన్నారు. దీంతో శిశువుకు పలు వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందన్నారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ ఉద్యోగులు, పిల్లలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కశింకోట: తల్లి పాల వారోత్సవాల ముగింపు పురస్కరించుకొని బుధవారం కశింకోటలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు, అధికారులు మానవహారంగా ఏర్పడ్డారు. తల్లిపాల ప్రాముఖ్యతను ఐసీడీఎస్ సీడీపీవో పి.ప్రభావతి వివరించారు. పుట్టిన బిడ్డలకు ఆరు నెలల వరకు తల్లిపాలు తప్పనిసరన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.శేషుబాబు, అసిస్టెంట్ సీడీపీవో శశికళ, పీహెచ్‌సీ వైద్యాధికారి యశోద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## రోడ్డు ధ్వంసంపై రైతుల ఆందోళన

- రాజకీయ కక్షలతో ఇబ్బందులకు గురిచేయవద్దని డిమాండ్



రోడ్డుపై నిరసన తెలుపుతున్న రైతులు

సబ్బవరం: జిరాయితీ భూమిలో రైతుల పొలాలకు వెళ్లేందుకు నిర్మించుకున్న రోడ్డును రాజకీయ కక్షతో ధ్వంసం చేసిన వ్యక్తులు, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దళిత సంఘం నేత పాల్తేటి పెంటారావు డిమాండ్ చేశారు. మండలంలోని ఇరువాడ గ్రామంలో జాతీయ రహదారిని ఆనుకొని రైతుల పొలాల్లోకి వెళ్లే రోడ్డును తవ్వడాన్ని నిరసిస్తూ బుధవారం ఆయన రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఇరువాడ గ్రామంలో సర్వే నెంబర్ 108లో రైతుల పొలాల్లోకి వెళ్లే రోడ్డును ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి , ఆర్ఐ, వీఆర్వోలు పొక్లెయిన్ సాయంతో తవ్వేయడంతో రైతులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పూర్వం నుంచి రోడ్డు ఉండడంతోనే జాతీయ రహదారి విస్తరణ సమయంలో రోడ్డుకు జాతీయ రహదారి నుంచి డైవర్షన్ ఏర్పాటు చేశారన్నారు. స్థానికంగా ఉండే నేత ఒత్తిడితోనే రెవెన్యూ సిబ్బంది రోడ్డు తవ్వేశారని ఆరోపించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడిన వ్యక్తితో పాటు రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని లేదంటే తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. తాతారావు అనే రైతు మాట్లాడుతూ గ్రామ రైతులంతా 50 ఏళ్లగా ఇక్కడ పొలాలు సాగుచేసుకొంటూ జీవనం సాగిస్తున్నామన్నారు.స్థానిక ఎమ్మెల్యే పేరు అడ్డుపెట్టుకొని ఆ వ్యక్తి వివాదాలకు దిగుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.

## వుడ్ క్లస్టర్ ఏర్పాటు ప్రకటన హర్షణీయం



చేనేత వస్త్రాలతో బీజేపీ నాయకులు, కార్యకర్తలు

అనకాపల్లి: వుడ్ క్లస్టర్ ఏర్పాటుచేసి కార్పెంటర్లకు మేలు చేస్తానని ఎంపీ సీఎం రమేష్ ప్రకటన హర్షణీయమని బీజేపీ ఆర్టిజన్ సెల్ స్టేట్ కన్వీనర్ బంగారుబాబు అన్నారు. స్థానిక ఉడ్‌పేటలో పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కార్పెంటర్లు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, దశలవారీగా కూటమి ప్రభుత్వంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అంతకు ముందు పార్టీ కార్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యకర్తలకు చేనేత వస్త్రాలను పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అందించారు. కార్యక్రమంలో బీజేపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## నిరంతర సాధనతోనే ఉన్నత స్థానం సాధ్యం



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, అధ్యాపకులు

యలమంచిలి రూరల్ : నిరంతర సాధన, పరిశ్రమతో విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్ అన్నా రు. కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో డిగ్రీ కోర్సులు చదివి వివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన బుధవారం కళాశాల సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. ఏపీపీజీఈసెట్, సెంట్రల్ వర్సిటీ పీజీ ఎంట్రన్స్ పరీక్షల్లో ప్రతిభ చూపి ప్రవేశాలు పొందిన 54 మంది విద్యార్థులను ఆయన, అధ్యాపకులు ప్రత్యేకంగా ప్రశంసించారు. పీజీ కోర్సుల్లో కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రవేశపరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు, పుస్తకాలను బహుమతిగా అందించారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా ఇదే ఒరవడిని కొనసాగించాలని ఆకాంక్షించారు.

### సామూహిక వరలక్ష్మీ వ్రతాలు రేపు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఈ నెల 9న శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బండారు ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11న సప్తమి, స్వాతి నక్షత్రం పురస్కరించుకుని అమ్మవారి బాలాలయంలో అమ్మవారికి నింబ(వేప)పత్రములతో ప్రత్యేక అలంకరణ చేస్తామన్నారు. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

### 'పీఏసీఎస్‌లో సభ్య రైతుల వివరాలు అందించాలి'

కశింకోట: స్థానిక పీఏసీఎస్‌లో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కంప్యూటరీకరణ జరుగుతున్నందున ప్రతి సభ్య రైతు తమ ఆధార్ కార్డు జెరాక్స్, సెల్ నంబర్ తదితర వివరాలు అందించాలని సంఘ సీఈవో ద్వారపురెడ్డి నూకేశ్వరరావు కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ వివరాలను తప్పనిసరిగా పీఏసీఎస్‌లో అందించాలన్నారు.

### జిల్లా మలేరియా అధికారి ఆకస్మిక తనిఖీ

ఎస్.రాయవరం: గ్రామాల్లో దోమల నియంత్రణకు చర్యలు తీసుకుని, వాటి వల్ల సోకే వ్యాధుల్ని నివారించాలని జిల్లా మలేరియా అధికారి పీజేఎంఆర్‌పీ నాయుడు అన్నారు. ఉప్పరాపల్లిలో బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వీధుల్లో మురుగునీటి నిల్వలు, చెత్త ఎప్పటికప్పుడు తొలగించి దోమలు వ్యాప్తిని తగ్గించాలన్నారు.

## పార్టీ ఫిరాయింపులు అనైతికం

- సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్

అనకాపల్లి: ఒక పార్టీ గుర్తుపై పోటీ చేసి, ప్రజలచే ఎన్నికైన నాయకులు ఆ పార్టీ అధికారంలో లేకపోతే, అధికారంలో ఉన్న పార్టీలోకి ఫిరాయించడం అనైతికమని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ బుధవారం ఓ ప్రకటనలో ఆక్షేపించారు. పార్టీ మారాలనుకుంటే తమ పదవులకు రాజీనామా చేసి, వేరే పార్టీలో చేరాలన్నారు. రాజకీయ నాయకులు నైతిక విలువలకు తిలోదకాలిచ్చి, పార్టీలు మారడాన్ని తీవ్రంగా ఖండించారు. పార్టీ ఫిరాయింపుల చట్టం మేరకు ఇలాంటివారి పదవులు తొలగించాల్సి ఉన్నా, అధికార పార్టీలు తమకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఇది ఓటర్ల తీర్పును అవమాన పరచడమేనన్నారు. పార్టీ ఫిరాయించేవారిని ఆ పదవుల నుంచి వెంటనే తొలగించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం ప్రకారం అందరికీ ఒకే విధమైన నిబంధనలు ఉన్నాయని, అధికార పార్టీ నాయకులకు రాజ్యాంగం వర్తించదా అని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయించేవారు ముందు గెలిచిన సీటుకు రాజీనామా చేసి, కొత్తగా చేరే పార్టీ తరపున పోటీ చేసి, ప్రజల మద్దతు పొందాలన్నారు. ఆ విధంగా ప్రభుత్వాలు చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు.

## గట్లపై మొక్కల పెంపకంతో పురుగుల బెడదకు చెక్



పొలంబడి కార్యక్రమంలో ఏవో చంద్రావతి

పరవాడ: పొలం గట్లపై ఎర మొక్కలు నాటుకోవడం ద్వారా పురుగుల ఉధృతికి చెక్ పెట్టే అవకాశాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి సీహెచ్. చంద్రావతి సూచించారు. రావాడలో బుధవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. చీడ, పీడలను తగ్గించుకోవడానికి పొలం గట్లపై పసుపు పూలు పూచే కంది, బంతి, జనుము, పొద్దుతిరుగుడు లాంటి మొక్కలు నాటుకోవాలన్నారు. ఈ మొక్కలు పురుగులను ఆకర్షించి వరి పంటను కాపాడడానికి దోహదపడతాయన్నారు. వరి నాట్లు పూర్తి అయిన నెల రోజుల తర్వాత ద్రవరూప సూడోమోనస్ మందు ఎకరానికి అర లీటరు పిచికారీ చేయాలన్నారు. ఫలితంగా అగ్గి తెగులు, పొడ తెగులు బాక్టీరియా, ఆకుపొడ తెగుళ్ల నుంచి రక్షణ కల్పించవచ్చునని సూచించారు. కార్యక్రమంలో రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు, రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీకాంత్, శ్రీనివాస్, రాజేశ్వరి, వ్యవసాయ సహాయకులు గౌతమి, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీల తొలగింపు.. విగ్రహాలకు ముసుగులు



కశింకోటలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ముసుగు

కశింకోట: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించి, నాయకుల విగ్రహాలకు బుధవారం ముసుగులు వేశారు. పంచాయతీ ప్రధాన రహదారిలోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, దివంగత మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు, బసవ రామతారకం, మాజీ మంత్రి గుడివాడ గురునాథరావుల విగ్రహాలకు ముసుగులు వేశారు. జాతీయ రహదారిపై నాయకుల ఫ్లెక్సీలను తొలగించారు. అయితే ఇంకా వీధుల్లో ఫ్లెక్సీలు మిగిలే ఉన్నాయి. వాటినీ తొలగించడానికి చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్తున్నారు. గ్రామాల్లో కూడా వీటిని తొలగిస్తున్నారు.

### విత్తనశుద్ధితో అధిక దిగుబడులు



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వీఏఏ

మునగపాక : విత్తనశుద్ధితో అధిక దిగుబడులు సాధించవచ్చని అరబుపాలెం వీఏఏ సత్య రవిరాజ్ అన్నారు. అరబుపాలెం గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిసాగుకు సంబంధించి మంచి ఫలితాలు సాధించాలంటే తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాల్సి ఉంటుందన్నారు. తెగుళ్ల నివారణకు విత్తన శుద్ధి దోహద పడుతుందన్నారు. సుడోమోనాస్‌ను పిచికారీ చేయడం ద్వారా తెగుళ్లను నివారించవచ్చన్నారు. రైతులు కొయిలాడ ఎర్రయ్యనాయుడు, శరగడం గణేష్, బొడ్డేడ మహలక్ష్మి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బోధనతో పాటు అభ్యసన చేయించాలి



జి.భీమవరం పాఠశాలలో బోధనను పరిశీలిస్తున్న డైట్ సీనియర్ అధ్యాపకుడు గొట్టేటి రవి

కశింకోట: మండలంలోని జి.భీమవరం ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్) సీనియర్ అధ్యాపకుడు గొట్టేటి రవి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. అన్ని తరగతుల విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్‌లో చదవడం, రాయడం, గణిత ప్రక్రియలు చేయడంలో సామర్థ్యాలు కలిగి, ప్రావీణ్యం సంపాదించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సిలబస్ ప్రకారం బోధన చేసినా విద్యార్థులతో అభ్యసన చేయించకపోతే వృథా అవుతుందన్నారు. అభ్యసన కేంద్రీకృతంగా బోధన జరగాలని, తగిన బోధనోపకరణాలు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.